అక్షరశక్తి
The Power of Pen
Evening Daily


సంపుటి: 20 | సంచిక: 280 | వరంగల్ | మంగళవారం, 11 ఆగస్టు 2026 | పేజీలు: 6

## ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలి

రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేత అన్నారు.
- అక్షరశక్తి, హనుమకొండ



2



# ఓటరు జాబితాలో భారీ మార్పులు

## తెలంగాణలో డిజిటలైజేషన్ కానివి 73,39,234

### ఎస్ఐఆర్ అధికారిక ప్రకటన.. ఓట్ల తొలగింపు పై రాజకీయ పార్టీలు గరం

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (SIR)లో భాగంగా 73,39,234 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటైజ్ కాలేదు. ఎన్యూమరేషన్ ప్రక్రియకు గడువు ముగియడంతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం తాజాగా గణాంకాలను వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, 2,64,87,214 ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమే డిజిటైజ్ అయ్యాయి. అంటే మొత్తం ఓటర్లలో 78.30 శాతం మంది వివరాలు డిజిటైజ్ కాగా, 21.70 శాతం మంది ఓటర్లకు సంబంధించిన ఫారాలు డిజిటైజ్ కాలేదు.
- అక్షరశక్తి, హైదరాబాద్

5

దేశంలో బీజేపీని గద్దె దింపే వరకు

# సిపిఐ పోరు

- ఢిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి
- హనుమకొండలో సిపిఐ ప్రదర్శన, పాదయాత్ర ముగింపు



4

దేశంలోని ప్రజా వ్యతిరేక బిజేపీ పాలన నుండి ప్రజలకు విముక్తి కల్పించేందుకే సిపిఐ పోరాటం కొనసాగిస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక వెయ్యి స్థంబాల దేవాలయం నుండి ఈ ప్రదర్శన హనుమకొండ చౌరస్తా మీదుగా పబ్లిక్ గార్డెన్ వరకు కొనసాగింది. - అక్షరశక్తి, హనుమకొండ

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు

# ఏర్పాట్లు చేయాలి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం

అక్షరశక్తి, హైదరాబాద్ : తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.



5

## గుడిసెవాసులకు ఎమ్మెల్యే నాయిని భరోసా





**అక్షరశక్తి,కాజీపేట:** వైఎస్సార్ నగర్ గుడిసెవాసులు తమను కొందరు వ్యక్తులు భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. వారి సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. గుడిసెవాసులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, తాను వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అంకుస్, పసునూరి మనోహర్, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమార్, సుంచు అశోక్, 62వ డివిజన్ అధ్యక్షులు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యార్థినులకు ఇండక్షన్ ప్రోగ్రామ్



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (యూసీఈటీడబ్ల్యూ)లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థినులకు ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. బిక్షాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు, మోటివేషనల్ స్పీకర్ అనితా రెడ్డి విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యాభ్యాసంతో పాటు భవిష్యత్ కెరీర్‌పై స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. కెరీర్ గైడెన్స్, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, సమయపాలన వంటి అంశాలపై విలువైన సూచనలు అందించారు. రెండవ సెషన్‌లో యూసీఈటీడబ్ల్యూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీ వెంకటేష్ తూర్పాటి ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థినులు సామాజిక సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య అవగాహన, స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సెషన్ ఇన్‌చార్జ్ శ్రీ ఎ. శ్రీనివాస్ వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఇయర్ ఇన్‌చార్జ్ డాక్టర్ జోత్స్న, అధ్యాపకులు జి. కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డ్ మెంబర్స్ ఫోరం జిల్లా ఇన్‌చార్జిగా బోడ నవీన్ నాయక్



**అక్షరశక్తి, కొత్తగూడ :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం చింతగట్టు తండాకు చెందిన బోడ నవీన్ నాయక్... తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం మహబూబాబాద్ జిల్లా ఇంచార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం స్టేట్ ఫౌండింగ్ ప్రెసిడెంట్ నాగబెల్లి జ్యోతి ఆయనను అధికారికంగా నియమించారు. బోడ నవీన్ నాయక్ వేలుబెల్లి గ్రామపంచాయతీ 10వ వార్డు సభ్యుడిగా ఘన విజయం సాధించి, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు ఆయన తన వంతు కృషి చేస్తానని నవీన్ తెలిపారు.

# ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలి










**అక్షరశక్తి ,హనుమకొండ:** రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. మంగళవారం హనుమకొండ లోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (CBC)వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' పై రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రాం (ICOP), ఫోటో ఎక్సిబిషన్ ను పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ప్రసంగిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటంతో పాటు దేశ అభివృద్ధిలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని సూచించారు. మన రాజ్యాంగంలో రాసుకున్న హక్కులు, బాధ్యతలు ఏవైతే ఉన్నాయో పౌరులుగా మన బాధ్యత ఏంటి అనేవి ఇలాంటి కార్యక్రమాలు మనకి గుర్తు చేస్తాయన్నారు. ఎప్పుడూ మనం హక్కుల కోసం పోరాడడం అనేది ఒక నాణేనికి ఒక వైపు మాత్రమే. ఇంకోవైపు మన బాధ్యత ఏముంది అనేది తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు.

మనకి దక్కిన స్వాతంత్ర్యానికి మనం గౌరవం, విలువ ఇస్తూ, భవిష్యత్తు తరాలకి ఎటువంటి సమాజాన్ని అందిస్తామో అనేది మనపైనే ఆధార పడి ఉంటుందన్నారు. దేశాభివృద్ధి, భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉందన్నారు. మిమ్మల్ని మీరు ఎలా మలుచుకుంటారు అనేది మీ చేతుల్లోనే ఉంటుందని యువతను ఉద్దేశించి అన్నారు. మీ జీవితాలు మీరు ఎలా మలుచుకుంటారు అనేది వందకి వంద శాతం మీ చేతుల్లోనే ఉంటుందని, కష్టపడి మన జీవితాన్ని మనమే మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అలాగే క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో విద్యార్థులు చాలామంది ఉత్సాహంగా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం కోసం జరిగిన త్యాగాలు, పోరాటాల జ్ఞాపకాలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం మన అదృష్టం అని అన్నారు. ఇంత గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం మనకు లభించిన గొప్ప అవకాశమని తెలిపారు. మన రాజ్యాంగాన్ని పొందడం మన అదృష్టం అని పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు మనకు ఉన్నాయని అన్నారు.

దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీని, జనవరి 26వ తేదీని ఎంతో ఘనంగా జరుపుకుంటామని, ఇలాంటి కార్యక్రమాలను కూడా ప్రతి సంవత్సరం స్వాతంత్ర్యం వెనుక ఎంతటి కృషి, త్యాగం, పోరాటం దాగి ఉందో మనం ఎప్పటికీ మరచిపోకూడదనే ఉద్దేశంతో నిర్వహిస్తుంటామని అన్నారు. మనం ఈరోజు చూస్తున్న జాతీయ పతాకం ఒక్క రోజులో రూపుదిద్దుకున్నది కాదు అని దాని వెనుక ఎన్నో సంవత్సరాల కృషి, ఎన్నో పోరాటాలు ఉన్నాయని తెలిపారు. మనం పొందిన స్వేచ్ఛను, మనకు లభించిన ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంతో కృతజ్ఞతతో గుర్తుంచుకోవాలని అన్నారు. మనకు లభించిన ఈ స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు, భవిష్యత్ తరాలకు మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించేందుకు మన వంతు కృషి చేయాలన్నారు.

కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర సమాచార శాఖ ఆద్వర్యం లో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' పై పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. విద్యార్థులలో దేశం పట్ల బాధ్యత పెంపొందించటానికి ఇటువంటి కార్యక్రమాలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమం లో కళా బృందాలు 'హర్ ఘర్ తిరంగా' పై ప్రదర్శించిన యక్షగానం విద్యార్థులను ఆకట్టుకుంది. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీ లత,ప్రోగ్రామ్ ఇన్చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుమేళాలో ఎస్ఆర్ యూనివర్సిటీ స్టాల్స్ తో ప్రత్యేక ఆకర్షణ



**అక్షరశక్తి, హసన్‌పర్తి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కాళోజీ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి రైతు మేళా-2026లో ఎస్ఆర్ యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సందర్శించి స్టాల్స్ లను పరిశీలించారు. స్టాల్‌లో ఎస్. ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు తడి, మెట్ట, ఉద్యాన భూములకు సమగ్ర వ్యవసాయ విధానాల లైవ్ మోడల్స్, వర్మీకంపోస్ట్, సహజ వ్యవసాయ ఉత్పత్తులు, నేల తేమ సంరక్షణ, పాలీ మల్చింగ్, ఫార్మ్ పాండ్, వ్యవసాయ మార్కెటింగ్ క్యూఆర్ కోడ్‌లు, సమగ్ర కలుపు యాజమాన్యం, ప్రయోజనకర-హానికర కీటకాల నమూనాలను ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది.. రైతుల సందేహాలకు విద్యార్థులు సమాధానాలు అందించి, తక్కువ ఖర్చుతో సుస్థిర వ్యవసాయం, ప్రకృతి వనరుల సంరక్షణపై అవగాహన కల్పించారు.ఎస్ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జి భూపాల్ రాజ్ నాయకత్వంలో జి భార్గవి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ సహకారంతో స్టాల్ లో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎస్అర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు బి. సాయి కీర్తి, ఎం. ధన్య, టి. ఆకాంక్ష, జె. అక్షిత, ఎ. ప్రణిత, బి. అర్పిత, వి. మేఘన, సనా, టి. హన్సిక, ఎన్. సాయి సింధు, ఎం. స్పందన, జి. కుసుమ శ్రీ. లు యి స్టాల్ ను నిర్వహించారు.

# ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం





**అక్షరశక్తి,హనుమకొండ:** క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసం, పరస్పర అనుబంధం పెంపొందుతాయని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, ఐఏఎస్ అన్నారు. సమైక్య భావంతో పనిచేసినప్పుడే వినియోగదారులకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఉద్యోగులంతా ఒకే కుటుంబంలా భావించి క్రీడా స్ఫూర్తితో పోటీపడాలని సూచించారు.

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు వృత్తిపరమైన ఒత్తిడిని తగ్గించి ఉద్యోగుల్లో నూతనోత్సాహాన్ని నింపుతాయని సీఎండీ తెలిపారు. ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు, ఐక్యత, అనుబంధం పెరిగినప్పుడే సంస్థ పట్ల అంకితభావం పెరుగుతుందని, తద్వారా వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించగలమని చెప్పారు. బ్యాడ్మింటన్, క్రికెట్, క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ పోటీల్లో వివిధ సర్కిళ్లకు చెందిన 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంస్థ ఆధ్వర్యంలో తొలిసారిగా ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, ఇకపై ప్రతి ఏడాది క్రీడా, సాంస్కృతిక పోటీలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని వెల్లడించారు. క్రీడల్లో సంస్థలోని ప్రతి ఉద్యోగికి భాగస్వామ్యం కల్పిస్తామని సీఎండీ తెలిపారు. పోటీల్లో విజయం సాధించే ఏ సర్కిల్ జట్టు అయినా అది సంస్థ విజయంగానే భావించాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్వయంగా క్యారమ్స్ ఆడి ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి. మోహన్‌రావు, వి. తిరుపతిరెడ్డి, టి. మధుసూదన్, సి. ప్రభాకర్, సీఈలు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు మాధవరావు, వేణుబాబు, హేమంత్‌కుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎన్. జగన్నాధ్, సభ్యులు ప్రేమ్‌కుమార్, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ములుగు నియోజకవర్గం 100 శాతం పూర్తి

- **2,36,970 మంది ఓటర్లలో 2,09,128 మంది వివరాల డిజిటలైజేషన్**



**అక్షరశక్తి, ములుగు:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ములుగు నియోజకవర్గంలో ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జూన్ 25వ తేదీన ప్రారంభమైందని తెలిపారు. తొలి దశలో జూన్ 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించడంతో పాటు ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను ములుగు నియోజకవర్గంలో నూరు శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు. ములుగు నియోజకవర్గంలో మొత్తం 2,36,970 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,09,128 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 88.25 శాతంగా ఉందని పేర్కొన్నారు. మిగిలిన 27,842 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 8,354 మంది మరణించిన వారు, 4,015 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 14,207 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 1,219 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని వెల్లడించారు. అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం 11.75 శాతంగా ఉందన్నారు. డిజిటలైజేషన్ పూర్తయిన 88.25 శాతం, వివిధ కారణాలతో అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన 11.75 శాతం కలిపి ములుగు నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను జిల్లా కలెక్టర్ అభినందించారు.

# విశ్రాంత అధ్యాపకుల సేవలు మరువలేనివి

**కేయూ వీసీ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి**




**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో విశ్రాంత అధ్యాపకుల సేవలు చిరస్మరణీయమని, వారి కృషి ఫలితంగానే విశ్వవిద్యాలయం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవాల సందర్భంగా విశ్వవిద్యాలయ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆచార్య ఎ. సదానందం అధ్యక్షతన సెనెట్ హాల్‌లో నిర్వహించిన విశ్రాంత అధ్యాపకుల ప్రత్యేక సమావేశంలో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు అనేక సామాజిక ఉద్యమాల్లో కాకతీయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. సీనియర్ అధ్యాపకులు, అధికారులు, విశ్రాంత ఉద్యోగుల సంఘాల సమన్వయంతో కాకతీయ విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవాలను ఏడాది పొడవునా ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, కార్యక్రమాలు ఆగస్టు నెలకే పరిమితం కాకపోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విభాగం సీనియర్ విశ్రాంత అధ్యాపకులు ఆచార్య సీతారామారావు, వృక్షశాస్త్ర విభాగం సీనియర్ విశ్రాంత ఆచార్యులు ఆచార్య విద్యావతి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సీనియర్ విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎం. కిష్టయ్యలను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. స్వర్ణోత్సవ సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ ప్రస్థానాన్ని గుర్తుచేసిన ఆచార్య సదానందం సమావేశానికి అధ్యక్షత వహించిన ఆచార్య ఎ. సదానందం మాట్లాడారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, ఉన్నత విద్యారంగంలో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆచార్య కృష్ణ రెడ్డి వందన సమర్పణ చేశారు. విశ్రాంత అధ్యాపకులు తమ అనుభవాలను, గత స్మృతులను పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాన్ని సందర్శించే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేశారు.

# మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించిన మంత్రి కొండా సురేఖ





**అక్షరశక్తి,హైదరాబాద్:** ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మారు బోనం సమర్పించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఆలయ అధికారులు, అర్చకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. బోనమెత్తిన మహిళలకు మంత్రి చీర, సారె అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం చేయడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. ప్రభుత్వ ఏర్పాట్లకు ప్రజల సహకారం తోడవడంతో ఈ ఏడాది బోనాల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు.

# ఎన్‌సీసీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య ర్యాలీ..



**అక్షరశక్తి, వరంగల్ :** వరంగల్ లాల్ బాహదూర్ కళాశాల ఎన్సిసి పదవ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో 80 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవం, వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అపూర్వమైన భారత జాతీయ గీతం ప్రత్యేకతను చాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డి హెచ్ రావు తెలిపారు. జాతీయ గీతం ప్రాధాన్యతను కళాశాల ప్రాంగణంలో ఆలపించి దాని ప్రత్యేకతను వివరించి ములుగు రోడ్డు జంక్షన్ వరకు ప్రజల్లో మరింత అవగాహన కల్పించడం కోసం వికసిద్భారత్లో భాగస్వామ్యం కావాలని ఉద్దేశంతో ఎన్సిసి 10 తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నాల్ ఎస్ ఎస్ రామదుర్రై, ఏవో లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే ఆజ్ఞ మేరకు 15 ఆగస్టు 2026 వరకు రోజు ఒక కార్యక్రమం స్వతంత్ర ఫలాల ప్రాధాన్యతను తెలియపరచడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, హరి లోకేష్, రవళి, గోకుల్, సాహిల్, అనూష,శిరీష, రశ్మిత, నిఖిల్, భవాని శైలజ లక్ష్మీ ప్రసన్న, హేమంత్, అయాన్ పాషా, విష్ణు వంశీ ర్యాలీలో పాల్గొన్నారు.

# వీసీని కలిసిన ఎమ్మెల్యే కడియం



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విశ్వవిద్యాలయ అకాడమిక్ అంశాలు, అభివృద్ధి తదితర విషయాలపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఎమ్మెల్యే కడియం శ్రీహరిని జ్ఞాపికతో సత్కరించి అభినందించారు.

## ఉప్పరపల్లి విద్యార్థుల అడుగులకు

# అండగా రోటరీ క్లబ్




**అక్షరశక్తి, చెన్నారావుపేట:** విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి ఆరోగ్యం, సౌకర్యం, ఆత్మవిశ్వాసానికి తోడ్పడే లక్ష్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉమామహేశ్వర్–స్నేహలత దంపతుల సహకారంతో పాఠశాలలోని 125 మంది విద్యార్థులకు సుమారు రూ.50 వేల విలువైన షూస్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. చెన్నారావుపేట మండల ప్రత్యేక అధికారి డాక్టర్ టి.బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు షూస్ అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ హనుమకొండ అధ్యక్షులు వంగ రాజిరెడ్డి, ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు విద్యపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. విద్యార్థులకు షూస్ అందించడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత కొనసాగాలని రోటరీ క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ అనిత మొగిలి, అవయవ దాతల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొన్‌రెడ్డి మల్లారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం దాతలు ఉమామహేశ్వర్ రెడ్డి, స్నేహలత, మండ వేణులను ఘనంగా సత్కరించారు.

# ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం

- బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ముదిరాజ్



**అక్షరశక్తి, హన్మకొండ :** తెలంగాణ ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా విధులు నిర్వర్తించిన బీఎల్‌వోలు, పార్టీ నియమించిన బీఎల్‌ఏలకు మంగళవారం రోజున మచిలీబజార్‌లోని కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలకు, బీఎల్‌ఏలకు శాలువాలతో సత్కరించి, చిరు కానుకలు అందజేశారు. అనంతరం పులి రజినీకాంత్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటే కీలకమని అన్నారు. తెలంగాణ ఎన్నికల కమిషన్ నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో విధులు నిర్వర్తించి ప్రజల ఓటు మ్యాపింగ్, ఎన్యుమరేషన్ ఫామ్స్ పూర్తి చేయడం, డిజిటలైజేషన్ వంటి ప్రక్రియలో బీఎల్వోలు, బీఎల్ఏలు ఎంతో కృషి చేశారని కొనియాడారు. పౌరులు విధిగా వారి ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్వోలు సుష్మ, చంద్ర, నవ్య , రాజశ్రీ , నస్రిన్ , అశోక్ , నజుమా, కవిత, సంతోష, అస్మా, సరస్వతి , విజయ , రాజు, కుమార్, బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలు రఘు, స్రవంతి , వరుణ్ , శ్యామ్ , హరికృష్ణ, సుమిత్ర, నందకిషోర్, రామకృష్ణ , తదితరులు పాల్గొన్నారు.



# దేశంలో బీజేపీని గద్దె దింపే వరకు సిపిఐ పోరు

- ఢిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి
- హనుమకొండలో సిపిఐ ప్రదర్శన, పాదయాత్ర ముగింపు




**అక్షరశక్తి, హనుమకొండ :** దేశంలోని ప్రజా వ్యతిరేక బీజేపీ పాలన నుండి ప్రజలకు విముక్తి కల్పించేందుకే సిపిఐ పోరాటం కొనసాగిస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక వెయ్యి స్థంబాల దేవాలయం నుండి ఈ ప్రదర్శన హనుమకొండ చౌరస్తా మీదుగా పబ్లిక్ గార్డెన్ వరకు కొనసాగింది. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు దేశంలో మార్పు కోసం ఆగష్టు 6న జిల్లాలో ప్రారంభమైన పాదయాత్ర వారం రోజులుగా జిల్లాలో కొనసాగి మంగళవారం ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహిస్తుందని, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలే దాని పతనానికి దారి తీస్తాయని అన్నారు. దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని అన్నారు. బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగకరమైన ఒక మంచి పని చేయలేకపోయిందని, ధరలను అరికట్టడంలో, ఉద్యోగాల కల్పనలో విఫలమైందని అన్నారు. మహిళా రిజర్వేషన్ విషయంలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినా దానికి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును జోడించి ఆమోదింపజేసుకోవడానికి కుట్ర పన్నారని అన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షలు అనేక మార్లు లీక్ అయి లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీస్తుందని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని, రైతాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యము చేసి కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని, ఉపాధి హామీని నిర్వీర్యం చేశారని అన్నారు. సహజ వనరులను కార్పొరేట్ మిత్రులు అదానీ, అంబానీ లకు కట్టబెట్టడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, విద్య, ఆరోగ్యం ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణం అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై, మహిళలపై అకృత్యాలు, దాడులు పెరిగాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంకై ఆగస్టు 6 నుండి దేశవ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై సెప్టెంబర్ 1వ తేదీన ఢిల్లీలో దేశంలో మార్పు కోసం మహా ర్యాలీతో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ రాష్ట్ర నాయకులు టి. వెంకట్రాములు, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా నాయకులు ఎన్ ఎ స్టాలిన్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, జక్కు రాజు గౌడ్, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, ఏదునూరి వెంకట్రాజం, వేల్పుల సారంగపాణి, నేదునూరి రాజమౌళి, నకీర్త ఓదెలు, యేషబోయిన శ్రీనివాస్, మాలోతు శంకర్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, శనిగరపు రాజ్ కుమార్, కొట్టె వెంకటేష్, అదరి రమేష్, రాసమల్ల దీనా, ఉట్కూరి ప్రణీత్, గుంటి రాజేందర్, కండె నర్సయ్య, దామెర సుదర్శన్, డి. ప్రవీణ్, అధిక సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి





**అక్షరశక్తి, హన్మకొండ:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి, మలి దశ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల హక్కులను పరిరక్షించడంతో పాటు, వారికి ప్రభుత్వం తగిన గుర్తింపు, గౌరవం, సంక్షేమ పథకాలు కల్పించాలని కోరుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ తొలి మలి దశ ఉద్యమ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్సీ కోదండరామ్ రెడ్డి ని కలిసి ఉద్యమకారుల సమస్యలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను, సమయాన్ని, కుటుంబాలను త్యాగం చేసి ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రావు అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. అమరవీరుల ఆశయ సాధనే ప్రతి తెలంగాణ బిడ్డ లక్ష్యం అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమంలో కీలకంగా పాల్గొన్న తొలి, మలి దశ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించేందుకు మరింత సమగ్ర విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమకారుల సేవలను గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించడంతో పాటు, వారి కుటుంబాల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కో కన్వీనర్ రేపల్లె శ్రీనాథ్ మాట్లాడుతూ.. ఉద్యమకారుల హక్కులను పరిరక్షించాలి అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన మలి దశ ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు, గౌరవం, సంక్షేమ పథకాలు కల్పించి వారి హక్కులను పరిరక్షించే చర్యలు చేపట్టాలని ఉద్యమ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి వివరాలను పారదర్శకంగా నమోదు చేసి, అర్హులైన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. ఉద్యమకారుల గుర్తింపు విషయంలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా, ఉద్యమంలో వారి పాత్రను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మలి దశ ఉద్యమ నాయకులు చీఫ్ అడ్వైజర్ మట రాజశేఖర్ రెడ్డి, అడ్వైజర్ రషీద్ మరియు ఉద్యమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో భారీ మార్పులు



- తెలంగాణలో డిజిటలైజేషన్ కానివి 73,39,234
- ఎస్ఐఆర్ అధికారిక ప్రకటన
- ఓట్ల తొలగింపు పై రాజకీయ పార్టీలు గరం

**అక్షరశక్తి,హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (SIR)లో భాగంగా 73,39,234 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటైజ్ కాలేదు. ఎన్యూమరేషన్ ప్రక్రియకు గడువు ముగియడంతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం తాజాగా గణాంకాలను వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, 2,64,87,214 ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమే డిజిటైజ్ అయ్యాయి. అంటే మొత్తం ఓటర్లలో 78.30 శాతం మంది వివరాలు డిజిటైజ్ కాగా, 21.70 శాతం మంది ఓటర్లకు సంబంధించిన ఫారాలు డిజిటైజ్ కాలేదు.

డిజిటైజ్ కాని 73,39,234 మంది ఓటర్ల వివరాల్లో.. ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారు 45,18,961 (61.59%), మరణించిన వారు 9,22,230 (12.56%), అందుబాటులో లేని వారు 11,25,546 (15.34%), మరోచోట ఓటు ఉన్న డబుల్ ఓటర్లు 6,70,203 (9.13%), ఇతర కారణాలతో ఎన్యూమరేషన్ జరగని వారు *1,02,294 (1.39%)*గా ఉన్నారు. ఈ గణాంకాల నేపథ్యంలో ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటరు జాబితాపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

**ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల అప్రమత్తత**

SIR ప్రక్రియలో భారీగా ఓటర్ల వివరాలు డిజిటైజ్ కాకపోవడంతో ముసాయిదా జాబితాలో ఎవరి పేర్లు ఉంటాయి.. ఎవరి పేర్లు తొలగిపోతాయనే అంశంపై చర్చ మొదలైంది. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 30 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. వచ్చిన అభ్యంతరాలను అక్టోబర్ 15లోపు పరిష్కరించి, అనంతరం అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. 73.39 లక్షల మంది ఓటర్ల వివరాలు ఎన్యూమరేషన్‌లో లేకపోవడంతో రాజకీయ పార్టీలు అప్రమత్తమవుతున్నాయి. అధికార కాంగ్రెస్‌లోనూ ఈ అంశంపై ఆందోళన వ్యక్తమైనట్లు సమాచారం. అర్హత ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఇంటింటి స్థాయిలో పరిశీలన చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచనలు చేసినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్, బీజేపీలు సైతం తమ పార్టీ నేతలు, కార్యకర్తలను అప్రమత్తం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. అయితే ఎన్యూమరేషన్‌లో గల్లంతైన 73,39,234 ఓట్లలో తుది జాబితా నాటికి ఎన్ని ఓట్లు తిరిగి చేరతాయి, ఎన్ని పేర్లు తొలగింపునకు గురవుతాయన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

# కొయ్యూరు పీఎస్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ

- పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష
- ఆన్‌లైన్ నమోదుపై ప్రత్యేక దృష్టి
- ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




**అక్షరశక్తి, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వార్షిక తనిఖీల్లో భాగంగా కొయ్యూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ గారు మొక్క నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ గారు పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ గారు, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ కేసు రికార్డులను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించిన ఎస్పీ గారు అన్ని రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వారిపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు.

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి ఎస్పీ గారు సూచించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ వార్షిక తనిఖీల్లో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జున రావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థుల ప్రతిభ



**అక్షరశక్తి, వరంగల్ :** కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ జిల్లా స్థాయి పోటీలు వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్ బొల్లికుంటలో నిర్వహించారు. దీనిలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. పోస్టర్ పెయింటింగ్ ప్రథమ బహుమతి కె.స్ఫూర్తి, స్లామ్ పొయెట్రీ ద్వితీయ బహుమతి వి.అంజలి బి, గ్రూప్ డాన్స్ ద్వితీయ బహుమతి త్రినేత్ర అండ్ గ్రూప్, స్లోగన్ రైటింగ్ తృతీయ బహుమతి బి.దివ్య బహుమతులు గెలిచారు. పోస్టర్ పెయింటింగ్ లో మొదటి బహుమతి సాదించిన స్ఫూర్తి ఆగస్ట్ రెండవ వారం హైదరాబాద్ లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ బి.మానస, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమ, శైలజ కళాశాల సిబ్బంది అభినందించారు.

# పాతబస్తీ మెట్రో రైల్ పనులను వేగవంతం చేయాలి

**సీఎం రేవంత్‌రెడ్డి**



**అక్షరశక్తి, హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో విస్తరణ రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో రైల్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ పై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి పలు ఆదేశాలిచ్చారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మెట్రో విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోకు పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లను జత చేయాలని చెప్పారు. ఇందుకు అవసరమైన కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. మెట్రో ఫేజ్ 2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల కారిడార్‌కు సంబంధించి ప్రస్తుత సాంకేతికతపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి, అవసరమైన సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

## పేపర్ రెమ్యూనరేషన్ పెంచాలని వినతి



**అక్షరశక్తి, హన్మకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పేపర్ మూల్యాంకనం యొక్క రెమ్యూనరేషన్ పెంచాలని మంగళవారం నాడు కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం గారికి కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నుంచి వినతి పత్రం ఇవ్వడం జరిగింది, కాకతీయ విశ్వవిద్యాలయంలో అనేక సంవత్సరాల నుంచి పేపర్ రెమ్యూనరేషన్ పెరగకపోవడంతో పాటు గత సెమిస్టర్ డిగ్రీ పేపర్ యొక్క మూల్యాంకణము ఆన్లైన్ చేయటంతో అధ్యాపకులకు కొంత ఆర్థిక భారమైనది కాబట్టి మానవతా దృక్పథంతోని ఆలోచించి పేపర్ మూల్యాంకనం డిగ్రీ ఒక పేపర్ రెమ్యూనరేషన్ ను 16 రూపాయల నుండి 20 రూపాయలకు పెంచాలని అదేవిధంగా పీజీ ఒక పేపర్ రెమ్యూనరేషన్ ను 24 రూపాయలకు పెంచాలని మరియు సుమారు నాలుగు గంటల పాటు పరీక్షలకు సంబంధించిన విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేషన్ కి నాలుగు గంటల సమయం పడుతుంది కాబట్టి ప్రస్తుతానికి 150 రూపాయల నుండి 400 రూపాయలకు పెంచాలని ఈ వినతి పత్రంలో పేర్కొనడం జరిగింది ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్, డాక్టర్ కర్రే సదాశివ, డాక్టర్ వి.నవీన్, డాక్టర్ జి .కవిత తదితరులు పాల్గొన్నారు

## వాగ్దేవి కళాశాలలో నేషనల్ నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్




**అక్షరశక్తి, హనుమకొండ :** హనుమకొండ నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ అయిన వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మంగళవారం నాడు నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వాగ్దేవి అధ్యాపక బృందం విద్యార్థులను ఉద్దేశించి నశాసే ఆజాది మరియు వికాస్ కి తయ్యారి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కరక శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మత్తు మరియు మాదకద్రవ్యాల వ్యసనానికి లోను కావద్దని హానికరమైన మత్తుమందులను వైద్య సలహా లేకుండా అతిగా లేదా తప్పిదంగా ఉపయోగించరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. శ్రావణ్ కుమార్ వైస్ ప్రిన్సిపల్ మరియు వాగ్దేవి అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి నందుకు సెక్రెటరీ మరియు కరస్పాండెంట్ డాక్టర్ సిహెచ్ దేవేందర్ రెడ్డి మరియు వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ వాహినీ దేవి నిర్వాహకులను అభినందించారు.

# ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఏర్పాట్లు చేయాలి

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం**



అక్షరశక్తి, హైదరాబాద్ : తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్ లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

GUEST COLUMN

# గ్రంథాలయ శాస్త్ర పితామహుడు

## డాక్టర్ ఎస్. ఆర్. రంగనాథన్ - జీవితం, సేవలు, సాధించిన ఘనతలు

**పరిచయం:**
భారతదేశంలో గ్రంథాలయ శాస్త్రానికి పునాదులు వేసిన మహామేధావి డాక్టర్ శియాలీ రామామృత రంగనాథన్. ఆయన 134వ జన్మదినోత్సవం సందర్భంగా ఆగస్టు 12న దేశవ్యాప్తంగా 'జాతీయ గ్రంథాలయ దినోత్సవం'గా జరుపుకుంటారు. గణిత శాస్త్రజ్ఞుడిగా ప్రారంభించి, అనుకోకుండా గ్రంథాలయ రంగంలోకి వచ్చి, ప్రపంచాన్ని ఆకట్టుకున్న ఈ మహనీయుని జీవితం, విద్యా అర్హతలు, వృత్తి ప్రస్థానం, సాధించిన ఘన విజయాలు, పొందిన గౌరవ పురస్కారాలు ఇవన్నీ నేటి తరానికి స్ఫూర్తిదాయకం.

**బాల్యం, విద్యాభ్యాసం:**
1892, ఆగస్టు 12న (కొన్ని ఆధారాల ప్రకారం ఆగస్టు 9న) తమిళనాడులోని శియాలీ (ప్రస్తుతం శీర్కాళి) గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి రామామృత అయ్యర్, తల్లి సీతమ్మ. ఆయన ప్రాథమిక విద్య శియాలీలోని హిందూ ఉన్నత పాఠశాలలో సాగింది. 1909లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు.
ఉన్నత విద్య కోసం చెన్నైలోని మద్రాస్ క్రిస్టియన్ కళాశాలలో చేరారు. 1913లో గణిత శాస్త్రంలో బి.ఎ. డిగ్రీని,1916లో ఎం.ఎ. డిగ్రీని పొందారు. ఆ తర్వాత సైదాపేట్ టీచర్స్ కాలేజీలో శిక్షణ పొంది అధ్యాపక వృత్తికి సిద్ధమయ్యారు.

**ఉద్యోగ, వృత్తి ప్రస్థానం:**
1917లో మంగళూరు ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులుగా తమ వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 1920లో కోయంబత్తూరు ప్రభుత్వ కళాశాలలోను, 192123 మధ్య మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలోను గణిత శాస్త్ర బోధన చేశారు.

**గ్రంథాలయ శాస్త్ర రంగంలోకి అడుగు:**
1924, జనవరి 4న ఆయన జీవితంలోనే ఒక మలుపు. మద్రాసు విశ్వవిద్యాలయానికి తొలి గ్రంథాలయ అధిపతిగా నియమితులయ్యారు. ఆ సమయంలో ఆయనకు 'లైబ్రరీ క్లాసిఫికేషన్' (గ్రంథాలయ వర్గీకరణ) అనే పదం గురించి కూడా తెలియదు. మొదట ఈ ఉద్యోగాన్ని నిరాకరించదలిచారు 'ఏకాంత నిర్బంధం' అని భావించారు. కానీ అప్పటి ప్రిన్సిపాల్ హెర్బర్ట్ స్పెన్సర్ డంకన్ ఆయనను ఒప్పించి, గ్రంథాలయ నిర్వహణను అభ్యసించడానికి ఇంగ్లాండ్ పంపారు.



- డా.బి.రాధికా రాణి,
అధ్యక్షులు & ఛైర్‌పర్సన్,
బోర్డ్ ఆఫ్ స్టడీస్,
గ్రంథాలయ & సమాచార
శాస్త్ర విభాగం
కాకతీయ విశ్వవిద్యాలయం,
వరంగల్.

**ఇంగ్లాండు ప్రయాణం:** 1924 చివరలో ఇంగ్లాండ్ చేరుకున్నారు. బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలో కొంతకాలం గడిపి, ఆ తర్వాత లండన్ విశ్వవిద్యాలయం కళాశాలలోని లైబ్రేరియన్షిప్ పాఠశాలలో శిక్షణ పొందారు. అక్కడ డబ్ల్యు.సి. బెర్విక్ సేయర్స్ ఆయనకు మార్గదర్శకులయ్యారు. ఈ శిక్షణ ఆయన జీవితాన్ని సమూలంగా మార్చేసింది. తిరుగు ప్రయాణంలోనే మొదటి ప్రయోగం: ఇంగ్లాండు నుండి తిరిగి వస్తున్న ఓడలోని గ్రంథాలయాన్ని తాను అభివృద్ధి చేసిన కొత్త వర్గీకరణ పద్ధతితో పునర్వ్యవస్థీకరించారు. 1925లో భారతదేశం తిరిగివచ్చి, మద్రాసు విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో (అప్పటికే ఉన్న సుమారు 20,000 పుస్తకాలను) తాను అనుకున్న కొత్త పద్ధతిలో అమలు చేయడం ప్రారంభించారు.

**అత్యున్నత విద్యా, పరిశోధనా స్థానాలు:**
- **1945-47:** బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయాధిపతిగా, లైబ్రరీ సైన్స్ (గ్రంథాలయ శాస్త్రం) ప్రొఫెసర్ గా పనిచేశారు.
- **1947-54:** ఢిల్లీ విశ్వవిద్యాలయంలో లైబ్రరీ సైన్స్ ప్రొఫెసర్ గా పనిచేశారు. ఇక్కడే భారతదేశంలో తొలి గ్రంథాలయ శాస్త్ర పాఠశాలను స్థాపించి, ఉన్నత డిగ్రీల బోధనకు నాంది పలికారు.1954 57: స్విట్జర్లాండ్లోని జ్యూరిచ్ లో పరిశోధన, రచనలో నిమగ్నమయ్యారు.195759: ఉజ్జయినిలోని విక్రమ్ విశ్వవిద్యాలయంలో విజిటింగ్ ప్రొఫెసర్గా సేవలందించారు. 1962: బెంగళూరులో 'డాక్యుమెంటేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్' (డాక్యుమెంటేషన్ పరిశోధన, శిక్షణా కేంద్రం డి.ఆర్.టి.సి.)ను స్థాపించి, ఆజీవితాంతం దానితో అనుబంధంగా ఉన్నారు.



డాక్టర్. ఎస్.ఆర్. రంగనాథన్

**గ్రంథాలయ శాస్త్రానికి అమూల్య సహకారం:**
1.లైబ్రరీ సైన్స్ యొక్క పంచసూత్రాలు (గ్రంథాలయ శాస్త్ర పంచసూత్రాలు), 1931లో ప్రచురితమైన ఈ గ్రంథం ప్రపంచవ్యాప్తంగా గ్రంథాలయ సేవలకు ప్రాథమిక సూత్రాలుగా గుర్తింపు పొందింది. అవి:

**1. పుస్తకాలు ఉపయోగం కోసమే**
**(బుక్స్ ఆర్ ఫర్ యూస్)**
2. ప్రతి పాఠకునికి అతని/ఆమె పుస్తకం (ఎవరీ రీడర్ హిజ్/హర్ బుక్)
3.ప్రతి పుస్తకానికి దాని పాఠకుడు (ఎవరీ బుక్ ఇట్స్ రీడర్)
4. పాఠకుని సమయాన్ని ఆదా చేయండి (సేవ్ ది టైమ్ ఆఫ్ ది రీడర్)
5.గ్రంథాలయం ఒక వృద్ధి చెందుతున్న జీవి (లైబ్రరీ ఈజ్ ఎ గ్రోయింగ్ ఆర్గనిజం)

**2. కోలన్ వర్గీకరణ పద్ధతి(కోలన్ క్లాసిఫికేషన్):**
1933లో అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ ప్రపంచంలోనే తొలి ఫేసెటెడ్ వర్గీకరణ పద్ధతి. డ్యూయీ దశాంశ వర్గీకరణ (డ్యూయీ డెసిమల్ క్లాసిఫికేషన్ డి.డి.సి.) వంటి పాత పద్ధతుల పరిణామాన్ని కూడా ప్రభావితం చేసింది. ఈ పద్ధతిలో విషయాలను వాటి అంశాలుగా విభజించి, కొలోన్ (:) గుర్తును ఉపయోగించి వర్గీకరిస్తారు.

**3. ఫేసెట్ విశ్లేషణ (ఫేసెట్ అనాలిసిస్)**
విషయాలను వాటి భాగాలుగా విభజించే ఈ సాంకేతికతను ప్రవేశపెట్టారు. ఆయన ఐదు ప్రాథమిక వర్గాలను వ్యక్తిత్వం (పర్సనాలిటీ), శక్తి (ఎనర్జీ), పదార్థం (మ్యాటర్), స్థలం (స్పేస్), కాలం (టైమ్) గుర్తించారు.

**4. గ్రంథాలయ విద్యా వ్యవస్థ స్థాపన:**
భారతదేశంలో తొలి గ్రంథాలయ శాస్త్ర పాఠశాలను మద్రాసు విశ్వవిద్యాలయంలో ప్రారంభించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో లైబ్రరీ సైన్స్ విభాగాన్ని స్థాపించారు.

**5. ఇతర ముఖ్య రచనలు:**
- ప్రోలెగోమెనా టు లైబ్రరీ క్లాసిఫికేషన్ (1937)
- క్లాసిఫైడ్ కేటలాగ్ కోడ్ (1934)
- థియరీ ఆఫ్ ది లైబ్రరీ కేటలాగ్ (1938)
- ఎలిమెంట్స్ ఆఫ్ లైబ్రరీ క్లాసిఫికేషన్ (1945)
- క్లాసిఫికేషన్ అండ్ కమ్యూనికేషన్ (1951)

ఆయన 60కి పైగా పుస్తకాలు, 2000కు పైగా పరిశోధనా పత్రాలు రచించారు.

**6. సంస్థాగత స్థాపనలు:**
- ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ (ఇండియన్ గ్రంథాలయ సంఘం 1933)
- ఇండియన్ నేషనల్ సైంటిఫిక్ డాక్యుమెంటేషన్ సెంటర్ (ఐ.ఎన్.ఎస్.డి.ఓ.సి.) ప్రస్తుతం కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ డెవలప్మెంట్ స్టడీస్ (సి.ఎస్.ఐ.ఆర్.ఎన్.ఐ.ఎస్.సి.పి.ఆర్.) (1952)
- డాక్యుమెంటేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (డి.ఆర్.టి.సి.) (1962)

**గౌరవ పురస్కారాలు, జాతీయ-అంతర్జాతీయ గుర్తింపు:**

**భారత ప్రభుత్వ గౌరవాలు:**
- పద్మశ్రీ పురస్కారం (1957): గ్రంథాలయ శాస్త్రానికి ఆయన చేసిన అసాధారణ సేవలకు భారత ప్రభుత్వం ఈ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించింది.
- జాతీయ పరిశోధనా ప్రొఫెసర్ (1965): లైబ్రరీ సైన్స్ లో తొలి జాతీయ పరిశోధనా ప్రొఫెసర్ గా భారత ప్రభుత్వం గౌరవించింది.
- తపాలా బిళ్ళ (1992): ఆయన పేరుమీద భారత ప్రభుత్వం ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది.
- జాతీయ గ్రంథాలయ దినోత్సవం: ఆగస్టు 12న ఆయన జన్మదినాన్ని ప్రతి సంవత్సరం 'జాతీయ గ్రంథాలయ దినోత్సవం'గా జరుపుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది.

**అంతర్జాతీయ గుర్తింపు:**
**మార్గరెట్ మాన్ సైటేషన్ (1970):**
అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్ (అమెరికన్ గ్రంథాలయ సంఘం) నుండి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.
- **మార్క్ ట్వైన్ సొసైటీ:** అమెరికాలోని ఈ సంస్థ ఆయనకు 'గ్రాండ్ నైట్ ఆఫ్ పీస్' (శాంతి మహానైట్) బిరుదును ప్రదానం చేసింది.
- **గౌరవ డి.లిట్ (డాక్టర్ ఆఫ్ లెటర్స్):** ఢిల్లీ విశ్వవిద్యాలయం (1947), పిట్స్బర్గ్ విశ్వవిద్యాలయం (1964) ఆయనకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి.
- ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ డాక్యుమెంటేషన్ (ఎఫ్.ఐ.డి.) గౌరవ సభ్యుడు (1957): ఈ అంతర్జాతీయ సమాఖ్య ఆయనను గౌరవ సభ్యునిగా ఎన్నుకుంది.
- లైబ్రరీ అసోసియేషన్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్: కు ఆయన జీవితాంతం వరకు ఉపాధ్యక్షులుగా ఉన్నారు.
- ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ లైబ్రరీ అసోసియేషన్స్ (ఐ.ఎఫ్.ఎల్.ఎ.): గౌరవ సభ్యుడు.

**వ్యక్తిగత జీవితం:**
రంగనాథన్ 1928లో సరదా రంగనాథన్ ను వివాహం చేసుకున్నారు. ఆమె పేరుమీద 'సరదా రంగనాథన్ ఎండోమెంట్ ఫర్ లైబ్రరీ సైన్స్' (సరదా రంగనాథన్ గ్రంథాలయ శాస్త్ర నిధి)ను స్థాపించారు. ఆయన మనవడు రంగా యోగేశ్వర్.

**మరణం, శాశ్వత వారసత్వం:**
1972, సెప్టెంబర్ 27న బెంగళూరులో ఆయన కన్నుమూశారు. ఆయన మరణించినా, ఆయన సూత్రాలు, ఆలోచనలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా గ్రంథాలయాలకు మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. 'గ్రంథాలయం వృద్ధి చెందుతున్న జీవి' అన్న ఆయన ఐదవ సూత్రం డిజిటల్ యుగంలోనూ ఎంతో సందర్భోచితంగా ఉంది.
చివరిగా... గణిత శాస్త్ర బోధకుడిగా ప్రారంభించి, అనుకోని అవకాశంతో గ్రంథాలయ రంగంలోకి వచ్చి, దానినే తన జీవిత ధ్యేయంగా మలచుకుని, ప్రపంచాన్ని ఆకట్టుకున్న మహనీయుడు డాక్టర్ ఎస్. ఆర్. రంగనాథన్. ఆయన రూపొందించిన పంచ సూత్రాలు, కోలన్ వర్గీకరణ పద్ధతి, ఫేసెట్ విశ్లేషణ ఇవన్నీ గ్రంథాలయ శాస్త్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయి. పద్మశ్రీ పురస్కారం, జాతీయ పరిశోధనా ప్రొఫెసర్ హోదా, అంతర్జాతీయ గుర్తింపులు ఇవన్నీ ఆయన సేవలకు నిదర్శనాలు. నేడు ఆయన 134వ జన్మదినోత్సవం సందర్భంగా, ఆ మహామేధావి ఆలోచనలను గుర్తుచేసుకుంటూ, గ్రంథాలయ రంగంలో ఆయన చూపిన మార్గంలో నడవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. "పుస్తకాలు ఉపయోగం కోసమే" ఈ సరళమైన, గొప్ప సూత్రాన్ని ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.